క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్–చీమలకుంటపల్లె గ్రామాల మధ్య మిడ్ మానేరు ప్రాజెక్టు ఉపకాల్వ సమీపంలోని ఒక గుడిసెలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి, బత్తుల లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులో శనివారం రాత్రి ఓ ఆటోలో తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ధీరావత్ పాండ్, ధీరావత్ చాంద్, ధీరావత్ శ్రీను గ్రామాల్లో బియ్యం సేకరించి, తరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. ఆటోను సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ హాస్టళ్లకు నాణ్యమైన సరుకులు అందించాలి

శంకరపట్నం: ప్రభుత్వ హాస్టళ్లకు నాణ్యమైన సరుకులు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ డిమాండ్ చేశారు. కేశవపట్నంలో శనివారం ఫెడరేషన్ మండల సమావేశం నిర్వహించారు. సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అరకొర నిధుల విడుదలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు వినయ్ సాగర్, కార్తీక్, తిరుమలేశ్, రాజు తదితరులున్నారు.

బీరులో పురుగు



బీరులో వచ్చిన పురుగు

హుజూరాబాద్: జమ్మికుంట రోడ్డులో గల ఓ వైన్స్‌లో ఓ వ్యక్తి బీరును కొనుగోలు చేయగా అందులో పురుగు వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని కోరపల్లి వెంకటేశ్వర్లపల్లికి చెందిన పుల్లూరి సంపత్ శనివారం పని నిమిత్తం హుజూరాబాద్ వచ్చాడు. తిరిగి వెళ్తుండగా జమ్మికుంట రోడ్డులోని ఓ వైన్స్‌లో బీరు కొనుగోలు చేశాడు. తాగుతున్న క్రమంలో అందులో పురుగు కనిపించడంతో షాపు యజమానికి చూపించాడు. వెంటనే అతను మరో బీరు ఇచ్చాడు. బీరులో పురుగు వచ్చిందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మద్యం ప్రియులు ఖంగుతిన్నారు.

గానకోకిల అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న వెంకన్న

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్‌కు చెందిన జానపద కళాకారుడు పుల్ల వెంకన్న ఉత్తర తెలంగాణ పీపుల్స్ మోమెంట్ అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్‌కుమార్ చేతులమీదుగా గాన కోకిల అవార్డు అందుకున్నారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. వెంకన్న మాట్లాడుతూ.. తాను జానపద పాటలు రాస్తూ, పాడుతున్నానని, తనకు గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తనలాంటి ఎందరో కళాకారులకు ప్రోత్సాహం అందించాలని కోరారు.

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

హుజూరాబాద్: మండలంలోని పోతిరెడ్డిపేట–హుజూరాబాద్ ఉమేశ్ చంద్ర ఆటో యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎడ్ల భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా రాగం శ్యాం, గౌరవ అధ్యక్షుడిగా ఎర్ర కుమార్, గౌరవ సలహాదారుగా సతీశ్, ప్రధాన కార్యదర్శిగా శనిగరం తిరుపతి, కోశాధికారిగా ఎండీ.అమ్జద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బత్తిని రాజు, పాడిశెట్టి రాజ్‌కుమార్, చెన్నోజు రమేశ్, సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



రామడుగు: గోపాల్‌రావుపేటకు చెందిన లక్కీ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మాజీ ఉపసర్పంచ్ ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డి కుమారుడు స్వాతిక్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని, ఐదు పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు తాళ్లపల్లి శ్రీనివాస్, మడ్డి తిరుపతి, ఏగోలపు కొంరయ్య, పొన్నం వీరేశం, ముంజ శంకర్, బుర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం.. అభివృద్ధికి దూరం



సైదాపూర్ బస్టాండ్‌కు ఇరుకు రోడ్డుపై వెళ్తున్న బస్సు



మార్కెట్ వద్ద మొలంగూర్–ముల్కనూర్ ప్రధాన రహదారిలో ఇలా..

- సైదాపూర్‌లో ఇరుకు రోడ్లతో నరకయాతన
- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- విద్యాలయాలు ఇతర చోట్లకు తరలింపు
- అవసరాలకు హుజూరాబాద్, హుస్నాబాద్ వెళ్తున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సైదాపూర్: పేరుకు మండల కేంద్రం. వెన్కెపల్లి–సైదాపూర్ అనే జంట గ్రామాలతో ఏర్పడింది. పంచాయతీలు వేర్వేరు. పాలకులతోపాటు అన్ని రాజకీయ కీలక పదవుల్లో ఈ రెండు గ్రామాలకు చెందినవారే ఉంటారు. అయినా, సైదాపూర్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. రెండు దశాబ్దాలుగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధిపత్య పోరు అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. మండల కేంద్రంలో ఉండాల్సిన కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల ఆకునూర్‌కు వెళ్లిపోయింది. ఆదర్శ పాఠశాల సోమారంలో, ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమ్మక్క గుట్టకు, బీసీ గురుకులం పాఠశాలను హుజూరాబాద్ తరలించారు.

మూతపడిన థియేటర్, మార్కెట్

రెండు దశాబ్దాల క్రితం సైదాపూర్ మండల కేంద్రంలో సినిమా థియేటర్ ఉండేది. వారానికి ఒక రోజు పశువుల మార్కెట్‌తో ప్రజలతో సందడి నెలకొనేది. అవి మూతపడటంతో అలాంటి వాతావరణం ఇప్పుడు లేదు. ఏ మారుమూల గ్రామం, మండలం చూసినా మౌలిక వసతులతో, ఎంతో కొంత అభివృద్ధి చెందిన కనిపిస్తుంటే సైదాపూర్‌పై మాత్రం పాలకుల పట్టింపు కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడి ప్రజలు అవసరాల కోసం 10, 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న హుజూరాబాద్, హుస్నాబాద్ వెళ్తున్నారు. ఇక్కడ దళిత బంధు యూనిట్లు ప్రారంభించుకోగా ఆశించిన స్థాయిలో గిరాకీ రావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

డబుల్ రోడ్డు పనులు అస్తవ్యస్తం

గతంలో సైదాపూర్ నుంచి మొలంగూర్ వరకు డబుల్ రోడ్డు మంజూరవగా నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా చేపట్టారు. ఇందులో భాగంగా కొందరి ఇళ్లు తొలగించారు. మరికొందరివి తొలగించలేదు. దీంతో ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. బస్సు వెళ్తున్నప్పుడు ఎదురుగా మరో వాహనం వస్తే ఇక అంతే. మండల పరిషత్ కార్యాలయాల సముదాయానికి సరైన దారి లేదు. వెన్కెపల్లిలో బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి, పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉంది. పలు వాడల్లోనూ ఇదే పరిస్థితి. హైస్కూల్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సీసీరోడ్డు ఉంది. కానీ, పక్క నుంచి మరో వాహనం వెళ్లే అవకాశం లేదు. మొలంగూర్–వంగర, ములకనూర్ ప్రధాన రహదారిలో బస్సు బయటకు వెళ్లడం కష్టమవుతోంది. విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దుకాణాలకు వెళ్లే వినియోగదారులు వారి వాహనాలను రోడ్డుపైనే పార్కు చేయాల్సిన దుస్థితి. పెద్ద వాహనం వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

రోడ్డును విస్తరించాలి



సైదాపూర్‌లో రోడ్డును విస్తరించాలి. ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. హుజూరాబాద్ నుంచి వచ్చే బస్సులు కొత్త బస్టాండ్‌లోకి వచ్చేటప్పుడు, బస్టాండ్ నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. పాత బస్టాండ్ నుంచి మొలంగూర్ రోడ్డును అధికారులు సూచించిన మార్కింగ్ ప్రకారం విస్తరించలేదు. రోడ్డు పనుల సందర్భంగా కొందరి ఇళ్లను సెట్‌బ్యాక్ చేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేశారు.

– గాదపాక కుమార్‌రాజా, సామాజిక కార్యకర్త, సైదాపూర్

మౌలిక వసతులు లేవు



వెన్కెపల్లి–సైదాపూర్ గ్రామాలు అభివృద్ధికి నోచుకోకపోవడానికి కారణం పాలకుల నిర్లక్ష్యమే. ప్రజాప్రతినిధులు, నాయకుల ఆదిపత్య పోరులో సైదాపూర్ మండల కేంద్రం నిరాదరణకు గురైంది. కనీస మౌలిక వసతులు లేవు. మండల పరిషత్ కార్యాలయ సముదాయానికి బస్టాండ్ నుంచి రోడ్డు సరిగా లేదు. మండల కేంద్రంలో ఉండాల్సిన విద్యాసంస్థలు ఇతర గ్రామాలకు, పక్క నియోజకవర్గాలకు తరలివెళ్లాయి. వాటిని తిరిగి ఇక్కడికే తీసుకురావాలి.

– గున్నాల కృష్ణమూర్తి, సైదాపూర్

అంబేడ్కర్ భవనం మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కోరిన నాయకులు



ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట పాత ఎస్సీ కాలనీకి మినీ అంబేడ్కర్ భవనాన్ని మంజూరు చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్ కోరారు. ఈ మేరకు శనివారం ఖాసీంపేటకు వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాలనీవాసులు సమావేశాలు, సంఘం కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కిరాణా దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బద్దం సంపత్ రెడ్డి, సంఘం మండల అధ్యక్షుడు వెదిరె విజేందర్, ఉపాధ్యక్షుడు కల్లెపల్లి కొమురయ్య, సభ్యులు వెంకట్, నగునూరి సురేందర్, నర్సయ్య, చొక్కయ్య, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు ఇస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి శనివారం రూ.10.61 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కొండాపూర్, నవాబుపేట్, గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, రామంచ, చిన్నముల్కనూర్, పీచుపల్లి, సీతారాంపూర్, లంబాడిపల్లి, ఓగులాపూర్ తదితర గ్రామాలకు చెందిన వారికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గీకురు రవీందర్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్, నాయకులు షాబుద్దీన్, కాంతాల మహిపాల్‌రెడ్డి, యాదగిరి, బోయిని వేణుగోపాల్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



ఆగిపోయిన పనులు

శంకరపట్నం: మండలంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కేశవపట్నం రోడ్డుకు ఇరువైపులా రెండు రోజులుగా చేపడుతున్న టేలాలు, రేకుల తొలగింపు పనులను శనివారం ఆపేశారు. దీంతో పనులు జరుగుతాయో లేదోనని మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి, రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని కోరుతున్నారు.

వరుసగా కాపర్ వైరు చోరీలు



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీలు జరుగుతున్నాయి. పెంచాల పల్లె సమీపంలో ఈ నెల 6న 25 కేవీ, 11న నిజాయితీగూడెం నుంచి గట్టుదుద్దెనపల్లి వెళ్లే దారి వెంట మూడు 25 కేవీ, శుక్రవారం రాత్రి గట్టుదుద్దెనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వెనకాల పంట పొలాల వద్ద 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.85 వేలు ఉంటుందని, ఇప్పటివరకు రూ.5 లక్షల పైచిలుకు నష్టం వాటిల్లినట్లు ఏఈ రమేశ్ శనివారం తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ స్థలంలో మట్టి రోడ్డు?



మట్టిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎం వెంకటేశ్వర్లు

శంకరపట్నం: రెండు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం శనివారం వెలుగుచూసింది. కేశవపట్నం బస్టాండ్ వెనక భాగంలో వారసంత కోసం అధికారులు గతంలో స్థలం కేటాయించారు. ప్రతీ సోమవారం జరిగే సంతకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆ సమయంలో బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేటప్పుడు వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో కేశవపట్నం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మార్కెట్‌కు రోడ్డు ఏర్పాటు కోసం బస్టాండ్, వ్యవసాయ మార్కెట్ మధ్య మట్టిని పోసి, చదును చేస్తున్నారు. అయితే, ఆర్టీసీ స్థలంలోనే మట్టి రోడ్డు వేస్తున్నారని ఇన్‌చార్జి డీఎం వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం సంబంధిత మట్టిని పరిశీలించారు. ఎంపీడీవో శ్రీవాణితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలోనే మట్టి రోడ్డు వేస్తున్నామని ఆమె తెలిపారు.

దళిత బంధు నిధులు వెంటనే ఇవ్వాలి

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్: రెండో విడత దళిత బంధు నిధులను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దళితులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రారంభించిందన్నారు. అర్హులు రెండో విడత నిధుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు మధు, రాజేశ్, శంకర్, చంద్రమౌళి, రమేశ్ తదితరులున్నారు.

మత్తు పదార్థాలకు బానిసలవ్వొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేశ్

జమ్మికుంట: గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలవ్వొద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జమ్మికుంట టౌన్ ఎస్సై రాజేష్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో గంజాయి, డ్రగ్స్, సైబ ర్ నేరాలు, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, కొత్త చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. చదువుకునే సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే భవిష్యత్తు పాడవుతుందని తెలిపారు. మొబైల్‌కు గుర్తు తెలియని నంబర్ నుంచి లింక్ వస్తే ఓపెన్ చేయొద్దని, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

జమ్మికుంట: పేకాడుతున్న 9 మందిని పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. శంభునిపల్లి గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో శనివారం పేకాడుతున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లామన్నారు. జూదరుల వద్ద నుంచి, రూ.16,510 స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్సై రాజేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, జమ్మికుంట పట్టణంలో ఉంటున్న ఓ వ్యక్తి శంభునిపల్లిలో పేకాట స్థావరాన్ని ఏర్పాటు చేశాడని స్థానికులు ఆరోపించారు. హుజూరాబాద్, ఇల్లందకుంట, జమ్మికుంటతోపాటు పలు మండలాలకు చెందినవారు ఇక్కడికి వచ్చి, పేకాడుతున్నారని తెలిపారు. నిర్వాహకుడితోపాటు పేకాటరాయుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ టీచర్లే ఆయాలు

- 15 కేంద్రాల్లో అన్ని విధుల భారం వారిపైనే..
- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- మానకొండూర్ మండలంలో పరిస్థితి



ఖాదర్‌గూడెంలో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట ఊడుస్తున్న టీచర్ రేణుక

మానకొండూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేక టీచర్లు ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సినవారు ఆయాలు లేని సెంటర్లలో వారి పనులు కూడా చేస్తున్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, తమకు అదనపు భారం తప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

50 అంగన్‌వాడీ కేంద్రాలు..

మానకొండూర్ మండలంలో 50 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 15 కేంద్రాల్లో ఆయాలు వివిధ కారణాలతో బాధ్యతలకు దూరమయ్యారు. దీంతో ఒకటి కాదు, రెండు కాదు.. దాదాపు 8 ఏళ్లగా ఆయా సెంటర్లకు ఆయాలు లేకపోవడంతో వారి విధుల భారం టీచర్లపై పడింది. కొండపల్కల, గట్టుదుద్దెనపల్లి–2, ఊటూరు–2, రంగపేట, ఖాదర్‌గూడెం, పోచంపల్లి, మద్దికుంట, మానకొండూర్–2, మానకొండూర్–3, దేవంపల్లి–2, జగ్గయ్యపల్లి, సదాశివపల్లి, శ్రీనివాస్‌నగర్, పచ్చునూర్–1, పచ్చునూర్–2వ సెంటర్లలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రెండుచోట్ల టీచర్లు లేరు..

లింగాపూర్, మానకొండూర్ పరిధి బంజరుపల్లె సెంటర్లలో టీచర్లు లేక ఆయాలే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే టీచర్ల నియామకం చేపట్టాలని వారు కోరుతున్నారు.

సర్వేలుంటే పిల్లలు ఇంటికే..

అంగన్‌వాడీ టీచర్లు ఉదయం కేంద్రాల ఆవరణ శుభ్రం చేయడం, వంట పాత్రలు తోమడం, వంట చేసి, వడ్డించడం, చిన్నారులు బహిర్భూకి వెళ్తే కడగడం వంటి పనులు చేస్తూ నానాతంటాలు పడుతున్నారు. ఏళ్లుగా తమ ఇబ్బందులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ఆయాల నియామకం చేపట్టడం లేదని వాపోతున్నారు. అంతేకాకుండా, సర్వేలు, మండల, జిల్లా స్థాయిలో సమావేశాలకు వెళ్లాల్సిన వచ్చినప్పుడు పిల్లలను ఇంటికి పంపించాల్సి వస్తోందని చెబుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

అంగన్‌వాడీ ఆయాల పోస్టుల ఖాళీల అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రెండుచోట్ల టీచర్ల నియామకం చేపట్టాల్సి ఉంది. త్వరలో నియామకాలు చేపడుతారని ఆశిస్తున్నాం. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదు కొంత తగ్గింది. ఆగస్టు వరకు పెరుగుతుందని భావిస్తున్నాం.

– అరుణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్

చొప్పదండిలో గోరింటాకు ఉత్సవం



గోరింటాకు చూపుతున్న మహిళలు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో శనివారం అయ్యప్ప సేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. మహిళలు సామూహికంగా గోరింటాకు పెట్టుకొని, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బొడిగె వెంకన్న, ఎలిగేటి రాములు, కోశాధికారి దండె సత్యానందం, సభ్యులు దండె రవిందర్, కట్ట సత్యం, పిట్టల మల్లేశం, పిట్టల సత్యం, అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



నడిరోడ్డుపై గుంతకు అడ్డుగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

నడిరోడ్డుపై ప్రమాదకరంగా గుంత

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మార్కెట్ ఏరియా రోడ్డులో ఓ గుంత ప్రమాదకరంగా ఉంది. మూడేళ్ల క్రితం డ్రైనేజీ పైపులో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో సంబంధిత అధికారులు రోడ్డును తవ్వించి, పైపును పగులగొట్టి, చెత్తను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత దాన్ని పూడ్చలేదు. గుంతకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేయించి, చేతులు దులుపుకున్నారు. దీంతో రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వెంటనే గుంతకు మరమ్మతు చేపట్టి, పైకప్పు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వరద కాలువలో నీటి వేట



కాలువలో ప్రొక్లెయిన్‌తో తవ్విస్తున్న రైతులు

రామడుగు: గత ఐదేళ్లపాటు వరద కాలువలో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు విద్యుత్తు మోటార్లు బిగించుకొని, పంటలు సాగు చేసుకున్నారు. ఈ ఏడాది కాలువలో నీళ్లు లేకపోవడంతో సాగునీటికి నానాతంటాలు పడుతున్నారు. వానాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన వర్షాలు కురవకపోవడంతో వరద కాలువలో నీళ్లు లేని పరిస్థితి నెలకొంది. దీంతో అన్నదాతలు నీటి కోసం వేట సాగిస్తున్నారు. కాలువలో ప్రొక్లెయిన్‌లతో గుంతలు తవ్వుతూ పంటల సాగుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.